
ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



రాజన్న సిరిసిల్ల

5★★★ జిల్లా వార్తలు

గురువారం 27 ఫిబ్రవరి 2025



వేములవాడ రాజన్న ఆలయంలో కళాకారుల నృత్యాలు

హర హర మహాదేవ..



జాతరకు వస్తున్న భక్తుడు

- జిల్లాలో భక్తులతో పులకించిన శైవక్షేత్రాలు...
- ఘనంగా మహాశివరాత్రి వేడుకలు
- ఆలయాల్లో నిరంతర జలాభిషేకం...
- లింగోద్భవం, రుద్రాభిషేకం... బిల్వార్చనలు
- శివ భక్తుల మాల విరమణ



పూజలు చేస్తున్న మంత్రి పొన్నంప్రభాకర్, విప్ ఆది శ్రీనివాస్



కోనేరులో భక్తుల రద్దీ..

(ఆంధ్రజ్యోతి, సిరిసిల్ల)

హరహర మహాదేవ.. అంటూ శివనామ స్మరణతో జిల్లా వ్యాప్తంగా భక్తులు పులకించి పోయారు. మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా రాజన్న సిరిసిల్ల జిల్లాలో శైవక్షేత్రాలు కిటకిటలాడాయి. బుధవారం రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలో శివాలయాలు భక్తులతో పులకించిపోయాయి. వేములవాడ రాజరా జేశ్వర స్వామి దేవస్థానానికి జిల్లా కేంద్రం నుంచి పాదయాత్రగా వేలాది మంది తరలి వెళ్లారు. ప్రత్యేక పూజలు ఆరాధనాలతో ఆల యాలు భక్తిభావం ఉప్పొంగింది. ఉపవాసం, జాగరణతో రాజరాజేశ్వరస్వామిని భక్తిశ్రద్ధలతో కొలిచారు. అభిషేక ప్రియుడు, భోళా శంకరుడు అనుగ్రహంకోసం భక్తితో మహా శివరాత్రి వేడుకల అత్యంత వైభవంగా జరుపు కున్నారు. సిరిసిల్లలోని అతి పురాతనమైన చరిత్ర కలిగిన రాజరాజేశ్వరస్వామి దేవాల యంలో నిరంతర జలాభిషేకం, అఖండ దీపారాధన, రుద్రాభిషేకం, బిల్వార్చన పూజలు నిర్వహించారు. విశ్వనాథ ఆలయం, శివాలయం, మార్కండేయ దేవస్థానంలో ప్రత్యేక పూజలు, జలాభిషేకాలు, లింగోద్భవం, రుద్రహోమం నిర్వహించారు. శివరాత్రి పర్వది నాన్ని ఉపవాస దీక్షతో గండ దీపాన్ని వెలిగించుకోని జాగరణలు చేశారు. శివదీక్షదారులు మాల విరమణ చేశారు. జిల్లా లోని వేములవాడ క్షేత్రంతో పాటు సిరిసిల్ల, ఎల్లారెడ్డిపేట, తంగళ్లపల్లి, గంభీరావుపేట, ముస్తాబాద్, వీర్నపల్లి, ఇల్లంతకుంట, కోన రావుపేట, చం దుర్తి, రుద్రంగి, బోయిన్‌పల్లి, మండలాల్లో పలు దేవాలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

● రుద్రంగి : మండల కేంద్రం శివారులోని శ్రీబుగ్గ రాజరాజేశ్వర స్వామి కల్యాణం వైభవంగా నిర్వహించారు. శివరాత్రికి ఉత్సవాలను నిర్వహించడం ఆనవాయితీగా వస్తున్నది. భక్తులు ఉదయం నుంచి స్వామివారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అలాగే శివభక్త మార్కండేయ ఆలయంలో పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో శివపార్వతుల కల్యాణాన్ని ఘనంగా నిర్వహించారు. మార్కెట్ కమిటీ చైర్మన్ చెలుకల తిరుపతి, మాజీ సర్పంచ్ తర్రె ప్రభలత మనోహర్, ఇప్ప మహేష్, రాజిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

● కోనరావుపేట : మండలంలోని ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. మామిడిపల్లి శ్రీసీతారాముల ఆలయం, నిజామాబాద్ శివాలయం,

మిగతా 8లో

శంభో శంకరా...

- భక్తజన సంద్రంగా వేములవాడ క్షేత్రం
- శివనామ స్మరణతో మారుమోగిన రాజన్న ఆలయం



విద్యుత్ దీపాల వెలుగులో రాజన్న ఆలయం

“ మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా వేములవాడ క్షేత్రం బుధవారం శివనామ స్మరణతో మారుమోగింది. స్వామివారిని దర్శించుకునేందుకు భక్తులు భారీగా తరలివచ్చారు. వేములవాడ ఆలయంతోపాటు, పట్టణ వీధులు భక్తులతో కిక్కిరిసిపోయాయి. భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, కలెక్టర్ సందీప్‌కుమార్‌ఝూ, ఎస్పీ అఖిల్‌మహాజన్, ఈవో వినోద్‌రెడ్డి క్షేత్రస్థాయిలో ఏర్పాట్లను ఎప్పటికప్పుడు పర్యవేక్షించారు. రాజన్న ఆలయానికి పెద్ద ఎత్తున తరలివచ్చిన భక్తులు ఉపవాసం ఉండి జాగరణ దీపాలను వెలిగించి రాత్రంతా పరమశివుడి ఆరాధిస్తూ జాగరణ చేశారు. రాజన్న ఆలయంలో మహాలింగార్చన కార్యక్రమాన్ని అర్చకులు ఘనంగా నిర్వహించారు. రాత్రి 12 గంటల సమయంలో ఆలయ అర్చకులు స్వామి వారికి వేదమంత్రోచ్చరణలతో ఘనంగా లింగోద్భవాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో బీసీ సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ పాల్గొన్నారు. ”

- వేములవాడ కల్చరల్ (ఆంధ్రజ్యోతి)

7

అందరూ ఓటేసేలా..

- ఓటరన్న తీర్పునకు సర్వం సిద్ధం
- గ్రాడ్యుయేట్, టీచర్ల ఎమ్మెల్సీ ఓటింగ్‌కు 41 పోలింగ్ కేంద్రాలు
- పర్యవేక్షించిన కలెక్టర్, ఎస్పీ



సిరిసిల్ల డిస్ట్రిబ్యూషన్ కేంద్రంలో పోలింగ్ సామగ్రిని సరిచూసుకుంటున్న సిబ్బంది



జంబో బ్యాలెట్ బాక్స్



ఏర్పాట్లను పరిశీలిస్తున్న కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా

(ఆంధ్రజ్యోతి సిరిసిల్ల)

శాసనమండలి ఎన్నికల్లో పట్టభద్రులు, టీచర్లు ఓటు హక్కు వినియోగించుకునే విధంగా రాజన్న సిరిసిల్ల జిల్లా అధికార యంత్రాంగం పోలింగ్‌కు సర్వం సిద్ధం చేశారు. గురువారం ఉదయం 8 గంటల నుంచి 4 గంటల వరకు నిర్వహించే పోలింగ్ కోసం సిబ్బంది తరలివెళ్లారు. బుధవారం జిల్లా కేంద్రంలోని సిరిసిల్ల ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో ఏర్పాటు చేసిన డిస్ట్రిబ్యూషన్ సెంటర్ నుంచి సిబ్బంది ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన బస్సుల్లో భారీ బ్యాలెట్ బాక్స్‌లు, సామగ్రితో తరళివెళ్లారు. కలెక్టర్, ఎన్నికల అధికారి సందీప్‌కుమార్ ఝా డిస్ట్రిబ్యూషన్ తీరును పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. బందోబస్తును ఎస్పీ అఖిల్‌మహాజన్ పర్యవేక్షించారు. మెదక్, కరీంనగర్, నిజామాబాద్, ఆదిలాబాద్, ఉమ్మడి జిల్లాల ఎమ్మెల్సీ ఎన్నికల్లో పటభద్రులు, ఉపాధ్యాయ స్థానాల్లో పోటీ చేసిన వారి భవితవ్యం తేల్చే విధంగా ఓటర్లు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఓటు హక్కు వినియోగించుకోవడానికి జిల్లాలో 41 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. జిల్లా కేంద్రంతో పాటు వేములవాడ, సిరిసిల్ల, ఇల్లంతకుంట, గంభీరావుపేట, ముస్తాబాద్, ఎల్లారెడ్డిపేట, వీర్నపల్లి, బోయినపల్లి, చందుర్తి, కోనరావుపేట, రుద్రంగి, వేములవాడ రూరల్, తంగళ్లపల్లిలో పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశారు. 28 పట్టభద్రులు, 13 ఉపాధ్యాయ పోలింగ్ కేంద్రాలు ఉన్నాయి. వీటిలో 7 కామన్ పోలింగ్ కేంద్రాలు ఉన్నాయి.

ఎన్నికల నిర్వహణకు 185 మంది సిబ్బంది..

రాజన్న సిరిసిల్ల జిల్లాలో ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ నిర్వహణకు 185 మంది సిబ్బందిని నియమించారు. ఇందులో 29 మంది రిజర్వ్‌లో ఉంచారు. ప్రిసైడింగ్ అధికారులు 40 మంది, అసిస్టెంట్ ప్రిసైడింగ్ అధికారులు 40 మంది, ఇతర పోలింగ్ సిబ్బంది 89 మంది మైక్రో అబ్జర్వర్‌లు 16 మంది ఉన్నారు. భారీ జంబో బ్యాలెట్ బాక్స్‌లతో సిబ్బంది బుధవారం సాయంత్రం వరకే పోలింగ్ కేంద్రాలకు చేరుకున్నారు.

ఎన్నికల్లో 200 మందితో బందోబస్తు..

ఉపాధ్యాయ పట్టభద్రుల పోలింగ్ సందర్భంగా జిల్లాలో 41కేంద్రాల వద్ద పోలీసులు పటిష్టమైన బందోబస్తు ఏర్పాటు చేశారు. పోలింగ్ కేంద్రాల వద్ద బీఎన్‌ఎస్‌ఎస్ 163 యాక్ట్‌ను అమల్లో ఉంచారు. వంద మీటర్లు, 200 మీటర్ల పరిధిలో అంక్షలు కొనసాగనున్నాయి. ఎస్పీ అఖిల్ మహాజన్ బందోబస్తును పరిశీలించారు.

జిల్లాలో 23,347 మంది ఓటర్లు...

మెదక్, కరీంనగర్, నిజామాబాద్, అదిలాబాద్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో జిల్లాలో గ్రాడ్యుయేట్ ఉపాధ్యాయ ఓటర్లు 23,347 మంది ఉన్నారు. ఇందులో గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఓటర్లు 22,397 మంది ఉండగా పురుషులు 13,772 మంది, మహిళలు 8,625 మంది ఉన్నారు. టీచర్స్ ఎమ్మెల్సీ ఓటర్లు 950 మంది ఉండగా పురుషులు 677 మంది, మహిళలు 273 మంది ఉన్నారు. గత ఎన్నికల కంటే ఓటర్ల సంఖ్య పెరిగింది. 2019 ఎన్నికల్లో గ్రాడ్యుయేట్ 10,584మంది ఉండగా పురుషులు 7,390, మహిళలు 3,192 మంది ఉన్నారు. టీచర్లకు సంబంధించి 783 మంది ఉండగా పురుషులు 600, మహిళలు 183 మంది ఉన్నారు. గత ఎన్నికల కంటే 12,147 ఓట్లు పెరిగాయి. ఇందులో గ్రాడ్యుయేట్లు 11,980 మంది, టీచర్లలో 167 మంది పెరిగారు. జిల్లాలో పట్టభద్రుల ఓటర్లలో బోయినపల్లిలో 1,807మంది, చందుర్తిలో 962 మంది, కోనరావుపేటలో 1,496మంది. రుద్రంగిలో 392మంది, వేములవాడ 3,429, వేములవాడ రూరల్‌లో 970, సిరిసిల్లలో 5,117, ఇల్లంతకుంటలో 1,969, గంభీరావుపేటలో 1,226, ముస్తాబాద్‌లో 1,495, తంగళ్లపల్లిలో 1,561, వీర్నపల్లిలో 532,ఎల్లారెడ్డిపేటలో 1,441 మంది ఓటర్లు ఉన్నారు. ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఓటర్లలో బోయినపల్లిలో 46 మంది, చందుర్తిలో 28 మంది, కోనరావుపేటలో 35 మంది. రుద్రంగిలో 18 మంది, వేములవాడ 177, వేములవాడ రూరల్‌లో 27, సిరిసిల్లలో 272, ఇల్లంతకుంటలో 77, గంభీరావుపేటలో 66, ముస్తాబాద్‌లో 70, తంగళ్లపల్లిలో 37, వీర్నపల్లిలో 15, ఎల్లారెడ్డిపేటలో 82 మంది ఓటర్లు ఉన్నారు.

ప్రలోభాల పైనే ఆశలు..

ఉపాధ్యాయ, పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల బరిలో పోటీ పడుతున్న అభ్యర్థులు ఓటర్లను ఆకట్టుకోవడానికి అన్ని మార్గాలను అన్వేషిస్తున్నారు. ప్రచారపర్వం ముగియడంతోనే రాజన్న సిరిసిల్ల జిల్లాలో అభ్యర్థులు ప్రలోభాలకు తెర లేపారు. ప్రధానంగా కాంగ్రెస్, బీజేపీ, బీఎస్పీల అభ్యర్థుల మధ్యే త్రిముఖ పోటీగా మారింది. జిల్లాలో సోషల్‌మీడియా వేదికగా అభ్యర్థుల జోరు పెంచగా, కాంగ్రెస్ స్థానిక నాయకులతో ప్రత్యేక బృందాలుగా విభజించి ప్రచారం చేసింది. సాధారణ ఎన్నికల కంటే భిన్నంగా అభ్యర్థులు ఓటర్లను ప్రలోభాలకు గురిచేయడానికి సిద్ధమయ్యారనే ప్రచారం కొనసాగింది. పట్టభద్రులకు ఓటుకు రూ.2 వేలు, టీచర్లకు ఓటుకు రూ.5వేల వరకు ఇస్తున్నారనే ప్రచారం సాగింది. ముందుగానే ఇంటింటికి వెళ్లి వివరాలు సేకరించినా అభ్యర్థులు వారిని నేరుగా కలవడానికి ఏర్పాట్లు చేసుకున్నారు. ప్రచారం పర్వంలో పధానంగా కాంగ్రెస్ అభ్యర్థి డాక్టర్ వి నరేందర్‌రెడ్డి, బీజేపీ అభ్యర్థి చిన్నమైల్ అంజిరెడ్డి, బీఎస్పీ అభ్యర్థి ప్రసన్న హరికృష్ణ, ఆల్‌ఇండియా కిసాన్ జనతా పార్టీ అభ్యర్థి చంద్రశేఖర్, తెలంగాణ ప్రజాశక్తి పార్టీ అభ్యర్థి వెంకటేశం, ఆల్‌ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ అభ్యర్థి సర్దార్ రవీందర్ సింగ్, విద్యార్థుల రాజకీయ పార్టీ అభ్యర్థి బక్క జడ్సన్, ధర్మ సమాజ్ పార్టీ అభ్యర్థి మంద జ్యోతి, తెలంగాణ ద్రవిడ ప్రజల పార్టీ అభ్యర్థి బొల్లి సుభాష్, నేషనల్ నవక్రాంతి పార్టీ అభ్యర్థి చిలువేరి ఇంద్రాగౌడ్,లతో పాటు 44 మంది స్వతంత్రులు బరిలో ఉన్నారు. వీరితో పాటు ఉపాధ్యాయ ఎమ్మెల్సీ స్థానంలో బీజేపీ అభ్యర్థి మల్క కొమురయ్య, బీఎస్పీ అభ్యర్థి యాటకారి సాయన్న, దళిత బహుజన పార్టీ అభ్యర్థి గవ్వల లక్ష్మీ, స్వతంత్రులుగా వై అశోక్‌కుమార్, కంటె సాయన్న, కూర రఘోత్తంరెడ్డి, చాలిక చంద్రశేఖర్, జగ్గు మల్లారెడ్డి, తిరుమల్‌రెడ్డి, ఇన్నారెడ్డి, మామిడి సుధాకర్‌రెడ్డి, ముత్తారం నర్సింహస్వామి, వంగ మహేందర్‌రెడ్డి, వేముల విక్రమ్‌రెడ్డి, సిలివేరి శ్రీకాంత్, ఎల్ సుహాసిని పోటీలో ఉండి ప్రచారం చేశారు. అభ్యర్థులు కేవలం సోషల్ మీడియానే నమ్ముకోవడం గమనర్హం.

శివరాత్రి.. ఎన్నికల నిర్వహణలో సిబ్బంది

మహా శివరాత్రి పర్వదినం సందర్భంగా జిల్లాలో పండుగ సందడిగా ఉండగా ఎన్నికల సిబ్బంది మాత్రం విధుల్లో ఉన్నారు. ఓటర్లు బుధవారం శివరాత్రి జాగరణ ఉండడంతో గురువారం ఓటింగ్‌లో పోలింగ్ శాతంపై ప్రభావం చూపుతుందని భావిస్తున్నారు. సాధారణ ఎన్నికలతో పోలిస్తే పట్టభద్రులు, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల

మిగతా 8లో

రాజన్న సేవలో ప్రముఖులు..



కేంద్ర మంత్రి బండి సంజయ్‌కు రాజన్న ప్రసాదాన్ని అందజేస్తున్న అర్చకులు



స్వామివారికి ప్రత్యేక పూజలు చేస్తున్న కలెక్టర్, ఎస్పీ

వేములవాడ, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి) : మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా బుధవారం వేములవాడ రాజరాజేశ్వర స్వామిని పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. రాష్ట్ర పౌరసరఫరాలు, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్, ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్, ఎమ్మెల్సీలు కల్వకుంట్ల కవిత, బల్మూరి వెంకట్, కరీంనగర్ ఎమ్మెల్యే గంగుల కమలాకర్, నిర్మల్ ఎమ్మెల్యే మహేశ్వర్‌రెడ్డి, ఆర్మూర్ ఎమ్మెల్యే రాకేష్‌రెడ్డి, ప్రభుత్వ సలహాదారు శ్రీనివాసరాజు, కలెక్టర్ సందీప్ కుమార్ ఝా, ఎస్పీ అఖిల్‌మహాజన్, డిప్యూటీ సీఎం ఓఎస్డీ కృష్ణభాస్కర్ స్వామివారిని దర్శించుకున్న వారిలో ఉన్నారు.



వేములవాడ రాజన్న ఆలయంలో భక్తుల రద్దీ..

పోలింగ్ కేంద్రాలకు తరలిన సిబ్బంది





కరీంనగర్ డిస్ట్రిబ్యూషన్ కేంద్రం నుంచి సామగ్రితో వెళుతున్న సిబ్బంది



పోలింగ్ సామగ్రిని సరిచూసుకుంటూ..

ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్‌కు అధికారులు సర్వంసిద్ధం చేశారు. డిస్ట్రిబ్యూషన్ కేంద్రాల నుంచి సిబ్బంది ఎన్నికల సామగ్రిని తీసుకుని పోలింగ్ కేంద్రాలకు బుధవారం బయలుదేరారు. నియోజవర్గ పరిధిలోని 15 జిల్లాల్లో 773 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. పోలింగ్‌ను ప్రశాంతంగా నిర్వహించేందుకు అధికారులు ఏర్పాట్లు చేశారు. పోలింగ్ ముగిసిన తర్వాత బ్యాలెట్ బాక్సులను కరీంనగర్‌లోని రిసెప్షన్ సెంటర్‌కు తరలిస్తారు.





సిరిసిల్లలో..



జగిత్యాలలో..



పెద్దపల్లిలో..







కరీంనగర్ డిస్ట్రిబ్యూషన్ కేంద్రం నుంచి పోలింగ్ కేంద్రాలకు వెళుతున్న సిబ్బంది, పెద్దపల్లి, సిరిసిల్లలో పోలింగ్ కేంద్రాల వివరాలను సరి చూసుకుంటున్న సిబ్బంది, కరీంనగర్‌లో పోలింగ్ సామగ్రితో మహిళా సిబ్బంది

విద్యార్థి ఆత్మహత్య

● చిన్నమెట్‌పల్లిలో పండుగపూట విషాదం



సంజయ్ (ఫైల్)

కోరుట్ల రూరల్, ఫిబ్రవరి 26 (ఆంధ్ర జ్యోతి): పండగపూట మండలంలోని చిన్న మెట్‌పల్లి గ్రామంలో విషాదం నింపింది. పరీక్షలో ఫెయిల్ అవుతాననే అనుమానంతో బుధవారం ఓవిద్యార్థి ఆత్మహత్య చేసుకున్నాడు. గ్రామస్థులు.. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... గ్రామానికి చెందిన మోతూరి వెంకటేష్-లత దంపతులకు ఇద్దరు కుమారులు ఉన్నారు. రెండో కుమారుడైన సంజయ్(19) కల్లూర్ మోడల్‌స్కూల్‌లో ఇంటర్ రెండవ సంవత్సరం చదువుతున్నాడు. తండ్రి వెంకటేష్ ఉపాధి నిమిత్తం గల్ఫ్‌కు వెళ్లాడు. లత తన కుమారులతో చిన్నమెట్‌పల్లిలో నివాసం ఉంటోంది. సంజయ్ ఇంటర్ మొదటి సంవత్సరం ఫలితాలలో ఫెల్ అయినట్లు తెలిపారు. ఈ విషయంలో సంజయ్ మనోవేదనకు గురయ్యేవాడు. శివరాత్రి రోజు తల్లి రాయికల్ మండలంలో జరిగే వేడుకల్లో పాల్గొనడానికి వెళ్లగా సంజయ్ ఇంటి వద్ద ఒక్కడే ఉన్నాడు. సాయంత్రం లత ఇంటికి చేరుకుని చూడగా సంజయ్ ఇంట్లో ఫ్యాన్‌కు ఉరి వేసుకుని మృతి చెంది కనిపించాడు. స్థానికులు పోలీసులకు సమాచారం ఇవ్వగా వారు అక్కడికి చేరుకుని పరిశీలించారు. సంజయ్ తల్లి లత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు. సంజయ్ మృతితో పండగపూట గ్రామంలో విషాదం నెలకొంది.

తాటిచెట్టుపై నుంచి పడి గీతకార్మికుడి మృతి



ధర్మయ్య గౌడ్(ఫైల్)

గన్నేరువరం, ఫిబ్రవరి 26(ఆంధ్రజ్యోతి): మండలంలోని జంగపల్లి గ్రామంలో తాటి చెట్టు పైనుంచి జారిపడి గీత కార్మికుడు మృతి చెందడంతో పండగపూట గ్రామంలో విషాదం నెలకొంది. ఎస్‌ఐ తాండ్ర నరేష్ కథనం ప్రకారం.. జంగపల్లి గ్రామానికి చెందిన ముత్యం ధర్మయ్యగౌడ్(59) వృత్తిరీత్యా గీత కార్మికుడు. రోజువారీ లాగే బుధవారం కల్లు గీసేందుకు తాటిచెట్టును ఎక్కి ప్రమాదవశాత్తు మోకుజారి కిందపడి తీవ్రగాయాలతో అక్కడికక్కడే మృతి చెందాడు. పోలీసులు సంఘటనా స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేసుకొని మృతదేహాన్ని పోస్టుమార్టంనిమిత్తం జిల్లాఆసుపత్రికి తరలించారు.

గుర్తు తెలియని వ్యక్తి అనుమానాస్పద మృతి

సిరిసిల్ల క్రైం, ఫిబ్రవరి 26(ఆంధ్రజ్యోతి): సిరిసిల్లపట్టణం చంద్రంపేటలోని రాఘవేంద్ర రైస్‌మిల్ వెనుకాలగల స్థలంలో బుధవారం 35 సంవత్సరాల గుర్తుతెలియని వ్యక్తి అనుమానాస్పద స్థితిలో మృతిచెంది ఉన్నాడు. స్థానికులు మృతదేహాన్ని చూసి పోలీసులకు సమాచారం అందించారు. మృతుడు ఎరుపు రంగు టీషర్టు, బ్లూరంగు జీన్ ప్యాంట్ ధరించి ఉన్నాడు. మృతదేహాన్ని మార్చురీగదికి తరలించి భద్రపరిచారు. కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నామని టౌన్‌సీఐ కె కృష్ణ తెలిపారు.

ఐదుగురిపై పిచ్చికుక్క దాడి

చందుర్తి, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి) : పిచ్చికుక్క స్వైరవిహారం చేసి ఐదుగురిపై దాడిచేసిన సంఘటన మండలకేంద్రంలో బుధవారం జరిగింది. గ్రామస్థుల కథనం ప్రకారం... గ్రామానికి చెందిన పవన్ సాయి, రోషన్, దీక్షిత అనే చిన్నారులతో పాటు దాసరి అమృత, ఎడ్ల సత్తయ్యలపై పిచ్చికుక్క దాడిచేసి గాయపరిచింది. బాధితులను చికిత్స నిమిత్తం మండలకేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్యకేంద్రానికి తరలించారు.

పేకాటరాయుళ్ల అరెస్ట్

కాల్వశ్రీరాంపూర్, ఫిబ్రవరి 26(ఆంధ్రజ్యోతి): పెగడపల్లి శివారులో బుధవారం పేకాట శిబిరంపై ఎస్‌ఐ వెంకటేష్ దాడి చేశారు. ఇద్దరు పట్టుబడగా ఐదుగురు పారిపోయినట్లు ఎస్సై తెలిపారు. వారి నుంచి రూ.30,240, మూడు సెల్ ఫోన్లు, ఆరు ద్విచక్ర వాహనాలు స్వాధీనం చేసుకొన్నారు. వారిపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

బీఎస్ఎన్ఎల్ ఆఫీసులో కేబుల్స్, బ్యాటరీల చోరీ

సుల్తానాబాద్, ఫిబ్రవరి 26(ఆంధ్రజ్యోతి): సుల్తానాబాద్ పట్టణంలోని బీఎస్ఎన్ఎల్ కార్యాలయంలో చోరీ జరిగింది. ఆవరణలో ఉన్న వైర్ల బండల్స్, బ్యాటరీలు గుర్తుతెలియని దొంగలు ఎత్తుకెళ్లినట్లు కార్యాలయ బాధ్యులు తెలిపారు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని విచారించారు. బీఎస్ఎన్ఎల్ కార్యాలయం బాధ్యులు ఫిర్యాదు చేశారు. వైర్ల బెండిల్స్ అరవైవేల రూపాయల విలువ ఉంటుందని, బ్యాటరీలు ఇరవైవేల రూపాయల విలువ ఉంటుందని తెలిపారు. ఈ మేరకు పోలీసులు కేసు చేశారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

వీణవంక ఫిబ్రవరి 26: మండలంలోని కనపర్తి గ్రామంలో పోలీసులు పెట్రోలింగ్ చేస్తుండగా ఎలాంటి అనుమతి పత్రాలు లేకుండా ఇసుక రవాణా చేస్తున్నా ట్రాక్టర్‌ను పట్టుకొని పోలీసుస్టేషన్ తరలించారు. కోర్కల్ గ్రామానికి చెందిన ట్రాక్టర్ డ్రైవర్ కొలిపాక శ్రీధర్ సుద్దాల దేవడుపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై తోట తిరుపతి తెలిపారు.

ప్రశాంతంగా ఓటు హక్కు వినియోగించుకోవాలి

● ఎన్నికల రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ పమేలా సత్పతి



సిబ్బందికి సూచనలిస్తున్న కలెక్టర్ పమేలా సత్పతి

కరీంనగర్ టౌన్, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): పట్టభద్రులు, ఉపాధ్యాయ నియోజకవర్గాల ఎమ్మెల్సీ ఎన్నికల్లో పట్టభద్రులు, ఉపాధ్యాయులు తమ ఓటు హక్కును ప్రశాంతంగా వినియోగించుకోవాలని ఎన్నికల రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ పమేలా సత్పతి సూచించారు. బుధవారం డాక్టర్ బీఆర్ అంబేద్కర్ స్టేడియంలో ఏర్పాటు చేసిన ఎన్నికల మెటీరియల్, బ్యాలెట్ బాక్సుల డిస్ట్రిబ్యూషన్, రిసెప్షన్ సెంటర్లను కలెక్టర్ సందర్శించారు. ఎన్నికల విధులు నిర్వహించే ప్రిసైడింగ్ అధికారులు, సిబ్బందికి పలు ఆదేశాలు, సూచనలు చేశారు. జిల్లాలోని పోలింగ్ కేంద్రాలకు వెళ్లే రూట్ మ్యాప్‌పై రూట్ ఆఫీసర్లతో చర్చించారు. బ్యాలెట్ బాక్సుల లాకింగ్ సిస్టమ్, సీలింగ్‌పై అవగాహన కల్పించారు. పోలింగ్ మెటీరియల్‌ను సరిచూసుకోవాలని, ఎక్కడా పొరపాట్లు జరగకుండా పోలింగ్ నిర్వహించాలన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎమ్మెల్సీ ఎన్నికలకు పటిష్టమైన ఏర్పాట్లు చేశామన్నారు. జిల్లాలోని 71,545 మంది పట్టభద్రుల ఓటర్లు, 4,305 మంది టీచర్లు ఓటర్లు ఉన్నారని అన్నారు. వీరి కోసం జిల్లాలో 103 పోలింగ్ స్టేషన్లను ఏర్పాటు చేశామని, కరీంనగర్ రెవెన్యూ డివి జన్‌లో 69 గ్రాడ్యుయేట్, 12టీచర్ పోలింగ్ స్టేషన్లు ఉన్నాయన్నారు. హుజురాబాద్ రెవెన్యూ డివిజన్‌లో 16 గ్రాడ్యుయేట్, 6 టీచర్స్ ఎమ్మెల్సీ పోలింగ్ స్టేషన్లు ఉన్నాయని చెప్పారు. గురువారం ఉదయం 8 నుంచి సాయంత్రం 4 గంటల వరకు పోలింగ్ జరుగుతుందన్నారు. ఓటు హక్కు కలిగిన వారు ఓటరు గుర్తింపు కార్డుతోపాటు కేంద్ర ఎన్నికల సంఘం అనుమతించిన 12 రకాల గుర్తింపుకార్డుల్లో ఏదో ఒకదానినిచూపించి ఓటు హక్కును వినియోగించుకోవాలని కలెక్టర్ పమేలా సత్పతి కోరారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్, ఆర్డీవోలు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

పుస్తెల తాడు చోరీ

సిరిసిల్ల క్రైం, ఫిబ్రవరి 26(ఆంధ్రజ్యోతి): సిరిసిల్ల పట్టణంలోని చంద్రంపేట గ్రామానికి చెందిన పసుల మంజుల అనే రాజన్న భక్తురాలి మెడలో నుంచి అగంతకులు పుస్తెలతాడు లాక్కెళ్లారు. మహాశివరాత్రి సందర్భంగా వేములవాడ రాజరాజేశ్వర స్వామి దర్శనానికి కాలినడకన చంద్రంపేట నుంచి వెళుతున్న మంజుల అనే భక్తురాలిని ద్విచక్రవాహనంపై వెంబడించిన ఇద్దరు అగంతకులు అగ్రహారం సమీపంలోని గుర్రవానిపల్లె వద్ద అటకాయించి ఆమె మెడలోనుంచి 3తులాల పుస్తెల తాడును లాక్కెళ్లారని బాధితురాలు పేర్కొంది. సమాచారం అందుకున్న పోలీసులు సిరిసిల్ల, వేములవాడ పట్టణాల మధ్య అగంతకుల కోసం గాలింపులు చేపట్టారు. సీసీ పుటేజీల ఆధారంగా అగంతకులను గుర్తించేందుకు పోలీసులు తీవ్రంగా ప్రయత్నిస్తున్నారు.

హోరాహోరీగా ఎడ్లబండ్ల పోటీలు



పోటీలను ప్రారంభిస్తున్న జగిత్యాల ఫస్ట్ అడిషనల్ డిస్ట్రిక్ట్ అండ్ సెషన్స్‌జడ్జి ఎస్ నారాయణ

గొల్లపల్లి, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): మహాశివరాత్రి పురస్కరించుకుని గొల్లపల్లి మండలం రాపల్లె గ్రామంలో ఆలయ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఎడ్లబండ్ల పోటీలు బుధవారం హోరాహోరీగా సాగాయి. పోటీలను జగిత్యాల ఫస్ట్ ఆడిషనల్ డిస్ట్రిక్ట్ అండ్ సెషన్ జడ్జ్ ఎస్ నారాయణ జెండా ఊపి ప్రారంభించారు. వివిధప్రాంతాల నుంచి వచ్చిన 17ఎడ్లబండ్లు పాల్గొన్నాయి. మంచిర్యాల జిల్లాకు చెందిన దెబ్బెట సాయివెంకటి ప్రథమ విజేతగానిలిచి దాత శ్రీరాజరాజేశ్వర స్వామి దేవస్థానం ఆలయకమిటీ అందించిన పావుతులం బంగారం కైవసం చేసుకున్నాడు. రెండో విజేతగా మండలంలోని వెన్గుమట్ల గ్రామానికి చెందిన నేరెళ్ల నరేష్ గౌడ్ నిలిచి శ్రీ రాజరాజేశ్వర స్వామి దేవస్థానం ఆలయ కమీటీ అందించిన 10తులాల వెండి గెలుచుకున్నాడు. తృతీయ బహుమతిగా గ్రామ తాజామాజీ సర్పంచ్ నల్ల శ్యామ్-రాజమణి దంపతులు అందించిన 5 తులాల వెండిని ఎండపెల్లి మండలం చర్లపెల్లి గ్రామానికి చెందిన మాదాసు వెంకట శివ గెలుచుకున్నాడు. అనంతరం ఆలయ ప్రాంగణంలో విజేతలకు బహుమతులను ప్రదానంచేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ప్రజాప్రతినిధులు మారంపల్లి బాబు, నల్ల శ్యామ్, కొక్కుల భూమయ్య, గండ్ర సత్యంరావు, నాయకులు సత్యానారాయణ గౌడ్, మల్లయ్య, శ్రీనివాస్, రాములు, వినోద్, ఆలయ కమీటీ సభ్యులు, భక్తులు, పెద్ద ఎత్తున ప్రజలు పాల్గొన్నారు.

సీపీఆర్‌తో భక్తుడిని కాపాడిన ఎస్సై



భక్తుడికి సీపీఆర్ చేస్తున్న ఎస్సై రమేష్

ఓదెల, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): శివరాత్రి వేడుకలకు వచ్చిన భక్తుడు ఆకస్మాత్తుగా గుండెపోటుతో కుప్పకూలడంతో వెంటనే పొత్కపల్లి ఎస్‌ఐ స్పందించి సీపీఆర్ చేసి కాపాడాడు. ఓదెల భ్రమరాంబ మల్లికార్జున స్వామి క్షేత్రంలో బుధవారం శివరాత్రి వేడుకలకు వీణవంక మండలం చల్లూర్ గ్రామంనుంచి వాహనంలో భక్తులు హాజరయ్యారు. పూజలు, దర్శనం పూర్తి కాగా మరొకొద్ది సమయంలో తిరుగు ప్రయాణంలో ఉండగా చల్లూర్‌కు చెందిన ఓర్సు శ్రీనివాస్ గుండెపోటుతో కుప్పకూలాడు. అక్కడే బందోబస్తు విధుల్లో ఉన్న పొత్కపల్లి ఎస్‌ఐ దికొండ రమేష్ వెంటనే సీపీఆర్ చేసి రక్షించాడు. అనంతరం ప్రాథమిక చికిత్స చేసి అస్వస్థతకు గురైన శ్రీనివాస్‌ను ఆసుపత్రికి తరలించారు.

ఎండుతున్న పంటపొలాలు

● అడుగంటిన భూగర్భ జలాలు ● ఎడారిని తలపిస్తున్న వాగులు ● జీవాలకు మేతగా వరిపొలాలు



సిరిసిల్ల: పెద్దూర్‌లో వరిపంటను మేస్తున్న గొర్రెలు

కరీంనగర్ రూరల్, ఫిబ్రవరి 26(ఆంధ్రజ్యోతి): కరీంనగర్ మండలంలోని పలుగ్రామాల్లో పచ్చని పొలాలు నీరులేక నెర్రెలు వారుతున్నాయి. యాసంగికి ఎంతో సంతోషంగా రైతులు వరి, మొక్కజొన్న పంటలను సాగుచేశారు. కానీ వేసవికాలం కూడా రానే లేదు.. అప్పుడేపొలాలు బీటలు వారుతున్నాయి. సాగు నీరు అందక పచ్చని పొలాలు ఎండిపోతున్నాయి. భూగర్భ జలాలు అడుగంటిపోయి బావులు బోరుమంటున్నాయని సాగు నీరందించాలని అధికారులను రైతులు వేడుకుంటున్నారు. కరీంనగర్ రూరల్ మండలంలోని మోతె, ఇరుకుళ్ల, మానేరు వాగుల్లో నీరులేకపోవడంతో పొలాలకునీరు అందడం లేదు. వాగుల్లోని వ్యవసాయ బావులు అడుగంటి పోతున్నాయి. ఎల్లంపల్లి, లోయర్ మానేరుడ్యాం, కొత్తపల్లి చెరువు, నారాయణపూర్ రిజర్వాయర్ నుంచి నీటి విడుదల చేయడం లేదు. దీంతో పొలాలు ఎండిపోగా రైతులు ఆందోళనకు గురవుతున్నారు. కరీంనగర్ మండలంలోని ఇరుకుల్ల, మొగ్దుంపూర్, నగునూర్, ఎలబోతారం, గోపాల్‌పూర్, దుర్శేడ్, నల్లగుంటపల్లి, మందులపల్లి గ్రామాల్లో సాగునీరుకు తీవ్రంగా ఇబ్బందులు తలెత్తుతున్నాయి. పొట్ట దశకు చేరిన సమయంలో నీటి విడుదల లేకపోవడంతో పొలాలు ఎండిపోతున్నాని రైతాంగం ఆవేదన వ్యక్తం చేస్తోంది. ఎస్సారెస్పీ నీరు కూడా సరిగా రావడం లేదని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మోతె, ఇరుకుల్ల, మానేరు వాగు పూర్తిఎడారిగా మారడంతో పక్కనే బోరుబావుల్లో కూడా నీరులేని పరిస్థితి నెలకొంది. ఇప్పటికే పలువురు రైతులకు చెందిన దాదాపు 100ఎకరాలకు పైబడి పంటలు ఎండిపోయాయి. వరి, మొక్కజొన్నపంటలు నీరందక ఎండిపోతున్నాయి. వెంటనే మోతె వాగులోకి నీరు విడుదలచేస్తే ఇరుకుల్ల, మానేరువాగు నీరుచేరి భూగర్భజలాలు పెరగడంతోపాటు బావుల్లో నీటిమట్టం పెరిగి పంటలను రక్షించుకోవచ్చని లేకుంటే పూర్తిగా రైతులు నష్టపోయే ప్రమాదం ఉందని రైతులు పేర్కొంటున్నారు. అధికారులు స్పందించి సాగునీటి సమస్యలు తీర్చాలని ఆయాగ్రామాల రైతులు కోరుతున్నారు.



కరీంనగర్ రూరల్ : మందలపల్లిలో నీరు లేక ఎండిన మొక్క జొన్న పంట

రామడుగు: ఓవైపు మండలంలో వరద కాలువ.. గ్రావిటికెనాల్.. మరోవైపు ఎల్లంపల్లి పైపులైన్ ఉన్నప్పటికీ పంటలకు చుక్కనీరు అందడంలేదు. మండలంలోని షానగర్, కోరటపల్లి, మోతె గ్రామాల్లో సాగునీరు అందక 200ఎకరాల్లో పొట్ట దశకు చేరుకున్న పంటలు ఎండిపోయే పరిస్థితిఏర్పడింది. మరో రెండు మూడు రోజులు పరిస్థితిఇలాగే కొనసాగితే పెద్దసంఖ్యలో పంటలు ఎండిపోయేపరిస్థితి ఏర్పడు తుందని రైతులుగగ్గోలు పెడుతున్నారు. ప్రభుత్వ యంత్రాంగం స్పందించి యుద్ధప్రతిపాదికన ఎల్లంపల్లి పైపులైన్ ద్వారా రిజర్వాయర్‌లోనికి నీటిని వదిలి అక్కడనుంచి నేరుగా మోతేవాగుకు నీటిని అందిస్తే తప్ప పంటలు తడిసే అవకాశంలేకుండా పోతుందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

గొర్రెలకు మేతగా మారిన వరి పంట..

సిరిసిల్ల రూరల్: సిరిసిల్లలో నీళ్లలేక ఎండిపోయిన వరిపంటలు గొర్రెలకు మేతగా మారిపోతున్నాయి. మల్కపేట రిజర్వాయర్ నుంచి నీటిని కాలువల్లోకి వదలకపోవడంతో సిరిసిల్ల అర్బన్ పరిధి పెద్దూర్ గ్రామంలోని వ్యవసాయ బావుల్లో నీరులేక వరి పంటలు ఎండిపోతున్నాయి. దీంతో రైతులు పశువులు, గొర్రెలకు మేతగా వదిలేశారు. పెద్దూర్ గ్రామ శివారులోని ఎద్దుగుట్ట ప్రాంతంలో ఉన్న కాసారం నర్సయ్యకు చెందిన రెండు ఎకరాలను గ్రామానికి చెందిన సలేంద్రి మల్లయ్య అనే రైతు కౌలు తీసుకుని వరి పంటను సాగు చేశాడు. పంట చేతికొచ్చే సమయంలో నీళ్ల లేకపోవడంతో గొర్రెలకు మేతగా వదిలేశారు. గ్రామానికి చెందిన తమ్మెట జీవన్‌కు చెందిన రెండు ఎకరాలు, సలేంద్రి మల్లయ్యకు చెందిన మూడు ఎకరాలు, గుర్రం నర్సయ్యకు చెందిన రెండు ఎకరాలు సైతం గొర్రెలకు మేతగా మారాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి మల్కపేట రిజ్వాయర్ నుంచి నీటిని చెరువుల్లోకి నింపి ఎండిపోతున్న పంటలను కాపాడాలని రైతులు కోరుతున్నారు.







కరీంనగర్ రూరల్ : చామనపల్లి, ఇరుకుల్ల, మొగ్దుంపూర్‌లో ఎండిపోయి బీటలు వారిన వరి, మొక్కజొన్న చేలు



రామడుగ మండలంలో ఎండుతున్న పొలంలో దిగాలుగా కూర్చొని ఆవేదన వ్యక్తం చేస్తున్న రైతు


వేములవాడ ఆలయం ఎదుట భక్తుల రద్దీ

విద్యుద్దీపాల వెలుగులో వేములవాడ రాజన్న క్షేత్రం




వేములవాడలో స్వామివారికి పట్టు వస్త్రాలు తీసుకువస్తున్న కేంద్ర మంత్రి బండి సంజయ్


ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత పూజలు

శంభో శంకరా..

● భక్తజన సంద్రంగా వేములవాడ క్షేత్రం ● శివనామ స్మరణతో మారుమోగిన రాజన్న ఆలయం

వేములవాడ కల్చరల్, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): మహాశివ రాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని వేములవాడ క్షేత్రం బుధవారం శివనామస్మరణతో మారుమోగింది. స్వామివారిని దర్శించుకుని అభిషేకం చేసేందుకు భక్తులు భారీగా తరలివచ్చారు. వేములవాడ ఆలయంతోపాటు, పట్టణ వీధులు భక్తులతో కిక్కిరిసిపోయాయి. మంగళవారం రాత్రి 11 గంటల నుంచి స్థానికులు పెద్ద సంఖ్యలో స్వామి వారి దర్శనానికి క్యూలైన్‌లో నిల్చున్నారు. తెల్లవారు జామున మూడు గంటల వరకు భక్తులకు దర్శనం కాకపోవడంతో భక్తులు పోలీసుల తీరుపైన అసహనం వ్యక్తం చేస్తూ పోలీసులు డౌన్‌డౌన్ అంటూ నినాదాలు చేశారు. దీంతో సంఘటన స్థలానికి చేరుకున్న ఆలయ ఈవో వినోద్‌రెడ్డి భక్తులకు నచ్చజెపి క్యూలైన్ త్వరగా కదిలేలా చర్యలు తీసుకున్నారు. ఉదయం స్వామి వారి ప్రత్యేక పూజల అనంతరం భక్తులకు లఘుదర్శనం అమలు చేశారు.

ఏర్పాట్ల పరిశీలన

భక్తులకు ఇబ్బందులు తలేత్తకుండా ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, కలెక్టర్ సందీప్ కుమార్ ఝా, ఎస్పీ అఖిల్‌మహాజన్, ఈవో వినోద్‌రెడ్డి క్షేత్రస్థాయిలో ఏర్పాట్లను ఎప్పటికప్పుడు పర్యవేక్షించారు. ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ భక్తుల క్యూలైన్‌లు, ధర్మగుండం, ఆలయ పరిసరాలను పరిశీలించారు. కలెక్టర్, ఎస్పీ క్యూ లైన్లను క్రమబద్ధీకరించి ఇబ్బందులు తలెత్తకుండా పర్యవేక్షించారు.

ఆకట్టుకున్న శివస్వాముల శోభాయాత్ర...

వేములవాడ రాజరాజేశ్వర స్వామి దీక్ష తీసుకున్న శివస్వాములు పంచామృతాలతో నిర్వహించిన శోభాయాత్ర ఆకట్టుకుంది. పంచామృతాలను నెత్తిన పెట్టుకుని ఒగ్గుడోలు చప్పుళ్ల మధ్యం, డీజే సౌండ్స్ మధ్య రాజన్న పాటలు పాడుతూ నృత్యాలు చేస్తూ శోభాయాత్రను వైభవంగా నిర్వహించారు. శివస్వాములకు మహిళలు మంగళహారతులతో స్వాగతం పలికారు. నాలుగు గం టల నుంచి ఐదు గంటల వరకు శివస్వాములకు కేటాయించిన సవ ంయ ంంలో రాజన్న అభిషేక పూజలో పాల్గొని రాత్రి మాలవిరమణ చేశారు.

అలరించిన కళాకారుల నృత్యప్రదర్శన..

శివార్చన వేదిక నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. రాజన్న ఆలయ గుడి చెరువలోని పార్కింగ్ స్థలంలో ఏర్పాటు చేసిన శివార్చన వేదికలో కళాకారులు తమ కళను ప్రదర్శించి భక్తులను ఆకట్టుకున్నారు.

ఆలయ ప్రధాన ద్వారానికి తాళం..

వేములవాడ రాజరాజేశ్వర స్వామి వారి ప్రధాన ద్వారానికి పోలీసులు తాళాలు వేయడంతో భక్తులు అసహనం వ్యక్తం చేశారు. ఎవరు లోనికి, వెలుపలికి వెళ్లకుండా తాళం వేయడంతో ఆరుబయటనే భక్తులు నిరీక్షించాల్సి వచ్చింది. దీంతో పోలీసులు, ఆలయాధికారులు, రాష్ట్ర ప్రభుత్వ తీరుపై భక్తులు మండిప డారు. విషయాన్ని బీసీ సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ దృష్టికి తీసుకువెళ్లడంతో స్పందించి వెంటనే ప్రధాన ద్వారా తాళాన్ని తొలగించి భక్తులను లోనికి అనుమతించారు. ఆలయంలోని ఉత్సవ కమిటీ సభ్యులను పోలీసులు అడుగడుగున అడ్డుకోవడంతో ఆలయ ఉత్సవ కమిటీ సభ్యులు పలువురు పోలీసుల తీరుపై అసహనాన్ని వ్యక్తపరుస్తూ తిరిగివెళ్లిపోయినట్లు తెలిసింది.

భక్తి, శ్రద్ధలతో జాగరణ

రాజన్న ఆలయానికి పెద్ద ఎత్తున తరలివచ్చిన భక్తులు ఉపవాసం ఉండి జాగరణ దీపాలను వెలిగించి రాత్రంత పరమశివుడిని ఆరాధిస్తూ జాగరణ చేశారు. పార్కింగ్ స్థలంలో ఏర్పాటు చేసిన స్థలాల్లో పండ్లు, దుంపలు, మక్కసత్తు, గోగిపువ్వులతో అలంకరించి జాగరణ దీపాలు వెలిగించారు. రాత్రంత మెళకువతో జాగరణ చేసి తెల్లవారు జామున వేకువనే ఉపవాస దీక్ష విరమించనున్నట్లు భక్తులు తెలిపారు.

విద్యుత్ కాంతుల్లో రాజన్న ఆలయం

మహాశివరాత్రి పర్వదినాన్ని పురష్కరించుకుని వేములవాడ శ్రీరాజరాజేశ్వరస్వామి వారి ఆలయం విద్యుత్ దీపాలతో వెలుగులు చిమ్ముతూ భక్తులను కనువిందు చేసింది. రాజన్న ఆలయ ప్రధాన గోపురాలతో పాటుగా ఆలయ ప్రహరీకి మిరుమిట్లు గొలిపే విద్యుత్‌దీపాలు, ఆలయ గుడి చెరువులోని పార్కింగ్ స్థలంలో పలు రకాల విద్యుత్ లైట్లు ఏర్పాటు చేయడంతో రాజన్న ఆలయంతో పాటుగా అనుబంధ ఆలయాలు కాంతులీనుతూ కనిపించాయి.

వైభవంగా మహాలింగార్చన

రాజన్న ఆలయంలో మహా లింగార్చన కార్యక్రమాన్ని అర్చకులు ఘనంగా నిర్వహించారు. మహా శివరాత్రిని పురష్కరించుకుని 128 మం ది అనువంశీక బ్రహ్మణ కుటుంబాలు మహా లింగార్చన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా అర్చకులు వేదమంత్రోచ్చరనల మధ్య లింగాకృతిలో దీపాలను వెలిగించారు. రాత్రి 12 గంటల సమయంలో ఆలయ అర్చకులు స్వామి వారికి లింగోద్భవాన్ని నిర్వహించారు. బీసీ సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ పాల్గొన్నారు.


వేములవాడలో భక్తుల క్యూ

మహిమగల దేవుడు వేములవాడ రాజన్న..
కేంద్ర మంత్రి బండి సంజయ్

వేములవాడ: వేములవాడ రాజరాజేశ్వరస్వామి మహి మగల దేవుడని, రాజన్న క్షేత్రం ఎంతో శక్తివంత మైనదని కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజ య్‌కుమార్ అన్నారు. మహా శివరాత్రి సందర్భంగా బుధవారం ఆయన వేములవాడ రాజరాజేశ్వరస్వామిని దర్శించుకుని పట్టు వస్త్రాలు సమర్పిం చారు. అనంతరం మీడియాతో మాట్లా డుతూ రాజరాజేశ్వరస్వామిని దర్శించుకోవడం ఎంతో సంతోషాన్ని కలిగించిందన్నారు. దేశ ప్రధాని నరేంద్ర మోదీ సైతం వేములవాడ రాజన్నను దర్శించుకున్నారన్నారు. మోదీ వేములవాడ రాజన్నను దర్శించుకున్నప్పటి నుంచి దేశవ్యాప్తంగా భక్తులు వేములవాడ రాజన్న దర్శనానికి వెళ్లాలని అనుకుంటున్నారని తెలిపారు. మహా శివరాత్రి సందర్భంగా వేములవాడలో ఏర్పాట్లు చాలా బాగున్నాయని ప్రశంసించారు. బీజేపీ సీనియర్ నాయకుడు ప్రతాప రామకృష్ణ, జిల్లా అధ్యక్షుడు రెడ్డవేని గోపి, సెస్ మాజీ అధ్యక్షుడు అల్లాడి రమేష్, పట్టణ అధ్యక్షుడు రాపల్లి శ్రీధర్, బండ మల్లేశం, గోపు బాలరాజు ఆయన వెంట ఉన్నారు.

దుబ్బరాజన్న క్షేత్రంలో..

సారంగాపూర్: జగిత్యాల జిలా దుబ్బ రాజన్న ఆలయంలో మహాశివరాత్రి వేడుకలు వైభవంగా జరిగాయి. భక్తులు స్వామి వారి ధర్శనం కోసం క్యూ లైన్‌లో బారులు తీరారు. కోడె మొక్కులు చెల్లించుకున్నారు. రాజన్న క్షేత్రం భక్త జనసందోహం తో కిటకిటలాడింది.

భక్త జన సంద్రంగా కోటిలింగాల

వెల్గటూర్: మహాశివరాత్రి సందర్భంగా బుధవారం కోటిలింగాల పార్వతీ కోటేశ్వరస్వామి ఆలయం భక్తులతో కిటకిట లాడింది. భక్తులు వేలాదిగా తరలివచ్చారు. గోదావరి నదిలో పుణ్య స్నానాలు ఆచరించిన భక్తులు క్యూలైన్ల ద్వారా వెళ్లి స్వామి వారికి అర్చన, అభిషేకా దులు నిర్వహించారు. ఆలయ ఈవో కాంతారెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేశారు.

శివనామస్మరణతో మారుమోగిన క్షేత్రాలు

ఓదెల: ఓదెల మండల కేంద్రంలోని భ్రమ రాంబ మల్లికార్జునస్వామి ఆలయంలో శివరాత్రి వేడుకలు వైభవంగా జరిగాయి. ఆలయంలో పెద్దపల్లి సివిల్ కోర్టు జూనియర్ జడ్జి మంజుల, అడిషనల్ కలెక్టర్ వేణు, ఏసీపీ గజ్జి కృష్ణతోపాటు భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. మండలం తో పాటు హైదరాబాద్, సిద్దిపేట, మంచిర్యాలకు చెందిన భక్తులు ఓదెల మల్లికార్జున స్వామి ఆలయాన్ని దర్శించుకుని పూజలు నిర్వహించారు. జాగారం చేసే భక్తుల కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేయగా, లింగోద్భవ కాలంలో గర్భగుడిలో శేషాలింగేశ్వరునికి బిల్వపత్రి సమర్పించారు. భక్తుల కాలక్షేపం కోసం గానలహరి, భజన మండలి కళాకారులతో సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించారు. భక్తులకు ఇబ్బందులు లేకుండా ఈవో సదయ్య, ఆలయ సిబ్బంది ఏర్పాట్లు చేశారు.


ఓదెల ఆలయంలో అభిషేకం చేస్తున్న పెద్దపల్లి జిల్లా న్యాయాధికారి మంజుల


వేములవాడలో కళాకారుడి ప్రదర్శన






ఇబ్రహీంపట్నం మండలం ఎర్దండి నుంచి గోదావరి జలాలు తీసుకెళ్తున్న భక్తులు


రాజన్న ఆలయ ఆవరణలో జాగరణ దీపాలు వెలిగించి మొక్కులు చెల్లించుకుంటున్న భక్తులు


మహాలింగార్చన కార్యక్రమంలో పాల్గొన్న అనువంశిక అర్చకులు


కరీంనగర్‌లో శివాలయం వద్ద బారులు తీరిన భక్తులు


దుబ్బరాజన్న క్షేత్రంలో కోడె మొక్కులు చెల్లిస్తున్న భక్తులు


స్వామివారి దర్శనానికి వస్తున్న శివ స్వాములు


కోటిలింగాల ఆలయం వద్ద గోదావరిలో భక్తుల స్నానాలు


భక్తులతో నిండిపోయిన వేములవాడ జాతర గ్రౌండ్

హరహర మహాదేవ..

(5వ పేజీ తరువాయి)


రుద్రంగిలో స్వామివారి కల్యాణంలో పాల్గొన్న భక్తులు

నాగారం కోదండ రామస్వామి ఆలయంతో పాటు పలు గ్రామాల్లోని శివాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. వేలాది భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు.

● చందుర్తి : మండలంలోని పలు ఆలయాల్లో మహాశివరాత్రి ఉత్సవాలు బుధవారం ఘనంగా నిర్వహించారు. ఎన్గల్ శ్రీరాజరాజేశ్వరస్వామి ఆలయంలో ఉదయం నుంచి భక్తులు శ్రీస్వామివారిని దర్శించుకున్నారు. మర్రిగడ్డలోని శివాలయంలో, చందుర్తి, మల్యాల మార్కండేయ స్వామి ఆలయంలో అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. మూడపల్లి శ్రీరాజ రాజేశ్వరస్వామివారి ఆలయంలో స్వామివారిని దర్శించుకుని ప్రజలు ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు.

● గంభీరావుపేట : మండల కేంద్రంతోపాటు పలు గ్రామాల్లో ఆలయాలు శివనామస్మరణతో మారుమోగాయి. మండల కేంద్రంలో శ్రీ మార్కండేయ ఆలయంలో శివపార్వతుల కల్యాణం నిర్వహించారు. పెద్ద సంఖ్యలో శివాలయాలకు వెళ్లి ప్రత్యేక పూజలు చేసి స్వామివారిని దర్శించుకున్నారు.

● ఇల్లంతకుంట : మండలంలోని రామలింగేశ్వరస్వామి, గంగాధర క్షేత్రం, విశ్వనాథ ఆలయం, దుబ్బ రాజేశ్వర స్వామి ఆలయంతోపాటు పలు గ్రామాల్లోని శివాలయాలు శివనామ స్మరణతో మారుమోగాయి. ఉదయం నుండి జాగారం పాటించిన భక్తులు సాయంత్రం ఆలయాలకు చేరుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఇల్లంతకుంటలో ఉత్సవ మూర్తులను ఊరేగించగా, మహిళలు మంగళహారతులతో స్వాగతం పలికారు.

● వీర్నపల్లి : మండలకేంద్రంతో పాటు రంగంపేట బుగ్గ రామలింగేశ్వర ఆలయాలు భక్తులతో కిటకిటలాడుతున్నాయి. వేకువజాము నుంచే భక్తులు ఆలయాల్లో మొక్కులు చెల్లించుకున్నారు. ఆయా గ్రామాల్లో శివలింగాలకు జలాభిషేకం చేసి పత్రి సమర్పించారు. అనంతరం శివపార్వతుల కల్యాణ వేడుకలను నిర్వహించారు. భక్తులకు అన్నదానం నిర్వహించారు.

● ముస్తాబాద్ : మండల కేంద్రంలోని శేవకేళవుల ఆలయంలో, మార్కండేయ ఆలయం, మార్కెట్‌లోగల శివాలయంలో, మద్దికుంట దారిలోని మెట్టు రాజరాజేశ్వరస్వామి ఆలయంతో పాటు పలు గ్రామాల్లో ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. శివకేశవుల ఆలయ ఆవరణలో సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించారు. మాజీ ఎంపీపీ జనగామ శరత్‌రావు, ఆలయ కమిటీ ఛైర్మన్ ఎలుసాని దేవయ్య, కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు యెల్ల బాల్‌రెడ్డి, సురేందర్‌రావు, మాజీ ఏఎంసీ ఛైర్మన్ అంజనేయరావు, గోద అంజిబాబు భక్తులు గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

● ఎల్లారెడ్డిపేట : మహా శివరాత్రి వేడుకలు ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంతో పాటు నారాయణపూర్, అక్కపల్లి, కోరుట్లపేట, రాచర్లబొప్పాపూర్, వెంకటాపూర్, బండలింగంపల్లి, రాచర్లగొల్లపల్లి, రాజన్నపేట, తదితర గ్రామాల్లో బుధవారం ఘనంగా జరిగాయి. వేకువజాము నుంచే శివాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. శివ న్నామ స్మరణతో మార్మోగాయి. ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. మండల కేంద్రంతో పాటు అక్కపల్లి, రాచర్లగొల్లపల్లి, నారాయణపూర్, రాజన్నపేట తదితర గ్రామాల్లోని ఆలయాల్లో వేద పండితుల మంత్రోచ్చరణల నడుమ శివపార్వతుల కల్యాణ వేడుకలను కన్నులపండువగా నిర్వహించారు. దంపతులు, భక్తులు భక్తిశ్రద్ధలతో స్వామి వారి కల్యాణ మహోత్సవాన్ని తిలకించారు. భారీ సంఖ్యలో పాల్గొని మొక్కులు చెల్లించుకున్నారు. కార్యక్రమంలో ఏఎంసీ ఛైర్‌పర్సన్ సబేరాబేగం, ప్యాక్స్ ఛైర్మన్ కృష్ణారెడ్డి, సెస్ డైరెక్టర్ కృష్ణహరి, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు ఆగయ్య, తాజా, మాజీ ప్రజాప్రతినిధులు, వివిధ పార్టీల నాయకులు, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

అస్వస్థతకు గురైన ఇద్దరు భక్తులు

వేములవాడ కల్చరల్, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి) : మహాశివరాత్రి జాతర సందర్భంగా రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ రాజన్న దర్శనానికి వచ్చిన ఇద్దరు భక్తులు అస్వస్థతకు గురయ్యారు. ఖానాపూర్‌కు చెందిన గంగరాజం, నిర్మల్ జిల్లా కేంద్రానికి చెందిన స్వామి అనే ఇద్దరు వ్యక్తులు రాజన్న దర్శనానికి వచ్చి క్యూలైన్‌లో అస్వస్థకు గురైనట్లు తెలిసింది. అయితే వెంటనే గమనించిన రెస్క్యూటీం సభ్యులు స్థానిక ఆసుపత్రికి తరలించగా, ఒకరి పరిస్థితి విషమంగా ఉండటంతో ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు.

నిజాయితీ చాటుకున్న కానిస్టేబుల్


పర్సు అందజేస్తున్న కానిస్టేబుల్

వేములవాడ కల్చరల్, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): భక్తురాలు పోగొట్టుకున్న పర్సును భక్తురాలికి అప్పగించిన ఓ కానిస్టేబుల్ తన నిజాయితీని చాటుకున్నాడు. టౌన్ సీఐ వీరప్రసాద్ తెలిపిన వివరాల ప్రకారం వేములవాడ శ్రీరాజరాజేశ్వర స్వామివారి ఆలయానికి మహాశివరాత్రి జాతరకు వచ్చిన నిజామాబాద్ జిల్లా వెల్పూర్ మండల అంకుశ్‌పూర్ గ్రామానికి చెందిన బోడ రాజవ్వ అనే మహిళ తన పర్సును పోగొట్టుకుంది. ధర్మగుండం వద్ద విధులు నిర్వర్తిస్తున్న తాడెం స్వామి, బండ అనిల్ అనే ఇద్దరు కానిస్టేబుల్స్‌కు దొరకడంతో తిరిగి భక్తురాలుకు అందించారు. భక్తురాలి పర్సులో రూ.5900 ఉన్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా టౌన్ సీఐ కానిస్టేబుల్ ఇరువురిని అభినందించాడు.

రాజ్యాంగాన్ని నీరుగార్చే ప్రయత్నాలు : సీపీఐ



మాట్లాడుతున్న సీపీఐ జిల్లా కార్యదర్శి గుంటి వేణు

సిరిసిల్ల టౌన్, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి) : భారత రాజ్యాంగాన్ని నీరుగార్చే ప్రయత్నాలు కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం చేస్తోందని సీపీఐ జిల్లా కార్యదర్శి గుంటి వేణు అన్నారు. బుధవారం సిరిసిల్ల పట్టణం ప్రెస్‌క్లబ్‌లో విలేకరుల సమావేశంలో వేణు, మాల మహానాడు జాతీయ కార్యదర్శి రాగుల రాములు మాట్లాడారు. భారత దేశానికి బీఆర్ అంబేద్కర్, భగత్‌సింగ్ రెండు కళ్లలాంటివారని నాడు ముఖ్యమంత్రి కేజ్రీవాల్ ప్రభుత్వం సీఎం కార్యాలయంలో వారి ఫోటోలు పెట్టిందన్నారు. ఢిల్లీలో కొత్తగా కొలువుదీరిన బీజేపీ ప్రభుత్వం 24గంటలు గడవక ముందే సీఎం కార్యాలయంలో డాక్టర్ బీఆర్ అంబేద్కర్, భగత్‌సింగ్ ఫొటోలను తొలగించడాన్ని వామపక్షాలు, దళిత ప్రజాస్వామిక వామపక్ష వాదులు ఖండిస్తున్నారని అన్నారు. బీఆర్ అంబేద్కర్, భగత్‌సింగ్ ఫోటోలను తొలగించి రాష్ట్రపతి, ప్రధానమంత్రి ఫోటోలను పెట్టడాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామన్నారు. బీజేపీకి వీరిద్దరంటే ఎందుకింత కసి అని ప్రశ్నించారు. అంబేద్కర్, భగత్‌సింగ్ సిద్ధాంతాలను సర్వనాశనం చేయడానికే బీజేపీ ఢిల్లీలో గెలిచిందన్న అనుమానాలు కలుగుతున్నాయన్నారు. భారతదేశ రాజ్యాంగాన్ని మారుస్తామని బీజేపీ ప్రభుత్వం చెబుతోందని, అలాంటి ప్రమాదం రాబోతుందని తాము భావిస్తున్నామన్నారు. దళిత సమాజంపైన దాడులు చేయడానికి బీజేపీ ప్రభుత్వం ముందుకొస్తుందని, అందుకు వ్యతిరేకంగా దళిత సమాజం పోరాటం చేయాల్సిన అవసరం ఉందన్నారు. అంబేద్కర్, భగత్‌సింగ్ ఫోటోలు పెట్టే వరకు పోరాటం చేస్తామన్నారు. అంబేద్కర్, భగత్ సింగ్ భావజాలంను విస్తృతంగా ప్రచారం చేస్తామన్నారు. దేశంలో మనువాద పార్టీని ఓడించాల్సిన అవసరం ఉందని ఈ నాటి ఎమ్మెల్సీ ఎన్నికలలో బీజేపీ అభ్యర్థులను ఓడించాలన్నారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ బీజేపీ అభ్యర్థి అంజిరెడ్డిని ఓడించాలని పిలుపునిచ్చారు. దేశవ్యాప్తంగా బీజేపీ ప్రభుత్వం కులగణనను చేపట్టాలని డిమాండ్ చేశారు. సమావేశంలో సీపీఐ సిరిసిల్ల పట్టణ కార్యదర్శి పంతం రవి, మాజీ కౌన్సిలర్ సిరిగిరి రమేష్, మాల మహానాడు జిల్లా అధ్యక్షుడు వంకాయల భూమయ్య, యువజన సంఘం పట్టణ అధ్యక్షుడు కొంపెల్లి విజయ్‌కుమార్, పండుగ రవి, బూర బాలు పాల్గొన్నారు.



విగ్రహ ప్రతిష్ఠాపనలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు, నాయకులు

పాఠశాలలో సరస్వతీదేవి విగ్రహ ప్రతిష్ఠాపన

చందుర్తి, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాల ఆవరణలో 1992-93 పదో తరగతి పూర్తి చేసిన పూర్వ విద్యార్థులు సరస్వతిదేవి విగ్రహంను బుధవారం ఘనంగా ప్రతిష్ఠించారు. పాఠశాలలో హిందీ పండిట్‌గా పనిచేసిన చందనగిరి దేవయ్య కుమారుడు హరికృష్ణ విగ్రహదాతగా, పూర్వ విద్యార్థులు నిర్మాణానికి సహకరించారు. సింగిల్‌విండో ఛైర్మన్ తిప్పని శ్రీనివాస్, మాజీ ఎంపీపీ చిలక పెంటయ్య, నాయకులు సిరికొండ శ్రీనివాస్, చిర్రం తిరుపతి, చిలుక భూమేశం, తిరుపతి రావు, రాచర్ల రాము, రవీందర్ రెడ్డి, పూర్వ విద్యార్థులు, పాఠశాల విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

అందరూ ఓటేసేలా..

(5వ పేజీ తరువాయి)

పోలింగ్ శాతం అంతంత మాత్రంగానే నమోదవుతుంది. ప్రభుత్వం వేతనంతో కూడిన సెలవును ప్రకటించినా ఓటర్లు ఉపవాసం చేసి ఉండడంతో విశ్రాంతి తీసుకోవడానికే ఇష్టపడుతారని భావిస్తున్నారు.

ఓటు హక్కు వినియోగించుకోవాలి..

- కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా

కరీంనగర్, ఆదిలాబాద్, నిజామాబాద్, మెదక్ జిల్లాల పట్టభద్రులు, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో గురువారం పోలింగ్ నిర్వహణకు సర్వం సిద్ధం చేశామని ఓటర్లు ఓటు హక్కు వినియోగించుకోవాలని సందీప్‌కుమార్ ఝా కోరారు. బుధవారం సిరిసిల్లలో డిస్ట్రిబ్యూషన్ కేంద్రాన్ని పరిశీలించారు. గ్రాడ్యుయేట్ అభ్యర్థులు 56, టీచర్ అభ్యర్థులు 15 మంది పోటీలో ఉన్నారని, జిల్లాలో 22,397 మంది గ్రాడ్యుయేట్ ఓటర్లు, 950 మంది టీచర్ ఓటర్లు ఉన్నారని అన్నారు. ఎన్నికల నిర్వహణకు 41పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశామని, 185 మంది సిబ్బందిని నియమించామని అన్నారు.

పటిష్ట బందోబస్తు ఏర్పాట్లు..

- ఎస్పీ అఖిల్‌మహాజన్

ఉపాధ్యాయ, పట్టభద్రుల పోలింగ్ సందర్భంగా 200మంది సిబ్బందితో పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశామని, ప్రశాంత వాతావరణంలో ఎన్నికల నిర్వహణ అధికారులు, సిబ్బంది కృషిచేయాలని ఎస్పీ అఖిల్‌మహాజన్ సూచించారు. బుధవారం పోలింగ్ కేంద్రాలను ఆయన పరిశీలించారు. పోలింగ్ ప్రక్రియ పూర్తయ్యే వరకు సిబ్బంది అప్రమత్తంగా ఉండి ఏలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా చర్యలు తీసుకుంటారన్నారు. పోలింగ్ కేంద్రాల వద్ద 163 సెక్షన్ అమల్లో ఉంటుందన్నారు. చట్ట విరుద్ధంగా ప్రవర్తించినా, గొడవలు సృష్టించాలని చూసినా వారిపై చర్యలు తీసుకుంటామన్నారు. ఐదుగురు కానీ అంతకంటే ఎక్కువగా గుంపులుగా తిరగవద్దని, ప్లకార్డులు, పార్టీ జెండాలు ప్రదర్శించవద్దన్నారు. ధర్నాలు, రాస్తారోకోలు, ఊరేగింపులు, టపాకాయలు కాల్చడం వంటివి నేరంగా పరిగణించి చర్యలు తీసుకుంటామన్నారు. మొబైల్ ఫోన్‌లు, ఎలక్ట్రానిక్ వస్తువులు పోలింగ్ కేంద్రాలకు అనుమతి లేదన్నారు. మైక్‌లు, బాక్స్‌లు ఉపయోగించరాదని, పాటలు, ఉపన్యాసాలు ఇవ్వకూడదన్నారు. ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించడానికి సహకరించాలని సూచించారు.


జనసంద్రంగా మారిన రాజన్న ఆలయ ప్రాంగణం


పంచామృతాలతో శివస్వాముల శోభాయాత్ర


రాజన్న దర్శనానికి వెళుతున్న శివస్వాములు

రాజన్న సన్నిధిలో ఉప్పొంగిన భక్తిభావం..

మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా వేములవాడ రాజరాజేశ్వర స్వామి సన్నిధిలో భక్తిభావం ఉప్పొంగింది. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల భారీ సంఖ్యలో భక్తులు తరలిరావడంతో ఆలయ ప్రాంగణం కిక్కిరిసిపోయింది. పిల్లాపాపలతో గంటల కొద్ది క్యూలైన్‌లో వేచి ఉంచి స్వామివారిని దర్శించుకున్నారు. భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, ఆలయ ఈవో వినోద్‌రెడ్డి ఏర్పాట్లను పర్యవేక్షించారు.



మొక్కులు చెల్లించుకుంటున్న భక్తులు


భక్తులకు పంపిణీ చేసే పండ్లను పరిశీలిస్తున్న ఆది శ్రీనివాస్


రాజన్న ఆలయ గుడిచెరువులో ఏర్పాటు చేసిన శివార్చన వేదిక


నృత్యం చేస్తున్న ఒగ్గు డోలు కళాకారులు


కళాకారులను అభినందిస్తున్న ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

బీఆర్ఎస్ హయాంలోనే వేములవాడ అభివృద్ధి

- ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత


వేములవాడలో విలేకరులతో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ కవిత

వేములవాడ, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలోనే వేములవాడ రాజరాజేశ్వర స్వామి దేవస్థానం అభివృద్ధికి భారీ ఎత్తున నిధులు కేటాయించి, స్థల సేకరణ చేసి పనులు ప్రారంభించారని శాసన మండలి సభ్యురాలు కల్వకుంట్ల కవిత అన్నారు. మహాశివరాత్రి సందర్భంగా బుధవారం ఉదయం ఆమె రాజరాజేశ్వర స్వామిని దర్శించుకున్నారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ దేశ ప్రజలందరూ సుభిక్షంగా ఉండాలని రాజరాజేశ్వర స్వామిని కోరుకున్నానన్నారు. వేములవాడ రాజన్నను దర్శించుకుంటే పదవులు పోతాయని లేనిపోని అపోహలతో నాటి ఆంధ్ర పాలకులు బదనాం చేశారన్నారు. ముఖ్యమంత్రిగా కేసీఆర్ పాలనలో సిరిసిల్ల ప్రాంతాన్ని రాజన్న సిరిసిల్ల జిల్లాగా ప్రకటించారని, రాజరాజేశ్వర స్వామి దేవాలయ అభివృద్ధి కోసం 30 ఎకరాల స్థలం, బద్దిపోచమ్మ ఆలయ అభివృద్ధికి ఎకరం సేకరించారని, ఆలయ అభివృద్ధికి 250కోట్ల రూపాయలు కేటాయించారని గుర్తుచేశారు. ప్రస్తుతం వేములవాడ గుడి చెరువులో అభివృద్ధి పనులు జరగడం లేదని స్థానికుల ద్వారా తెలిసిందని, ప్రభుత్వాలు మారినప్పటికీ అభివృద్ధి పనులు కొనసాగించాలని సూచించారు. ప్రస్తుత ప్రభుత్వం చేనేత కార్మికులను పట్టించుకోవడం లేదన్నారు. ప్రభుత్వం మారిన తర్వాత తమ పార్టీ కార్యకర్తలను ఇబ్బందులకు గురిచేస్తున్నారన్నారు. వెంట బీఆర్ఎస్ వేములవాడ నియోజకవర్గ ఇన్‌చార్జి చల్మెడ లక్ష్మీనరసింహారావు, జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య, జడ్పీ మాజీ ఛైర్‌పర్సన్ తుల ఉమ, స్థానిక నాయకులు ఉన్నారు.

ఎమ్మెల్సీ కవిత వ్యాఖ్యలు హాస్యాస్పదం

- రాజన్నను, భక్తులను మోసం చేసిన కేసీఆర్

- ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్


వేములవాడలో విలేకరులతో మాట్లాడుతున్న ఆది శ్రీనివాస్

వేములవాడ, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి) : వేములవాడ రాజరాజేశ్వరస్వామి దేవస్థానం అభివృద్ధి విషయంలో శాసనమండలి సభ్యురాలు కల్వకుంట్ల కవిత చేసిన వ్యాఖ్యలు హాస్యాస్పదంగా ఉన్నాయని, కాకమ్మ కబుర్ల వంటి కవిత వ్యాఖ్యలను ఎవరు పట్టించుకోవాల్సిన అవసరం లేదని వేములవాడ ఎమ్మెల్యే, రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ అన్నారు. మహాశివరాత్రి సందర్భంగా శ్రీరాజరాజేశ్వర స్వామివారిని దర్శించుకున్న అనంతరం ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత మీడియాతో చేసిన వ్యాఖ్యలపై ఆది శ్రీనివాస్ స్పందించారు. తన పెళ్లి ఇక్కడే అయిందని, ఆలయ అభివృద్ధికి ఏటా వంద కోట్ల రూపాయలు కేటాయిస్తానని హామీ ఇచ్చిన కేసీఆర్ రాజన్న ఆలయ అభివృద్ధికి ఒక్క రూపాయి కూడా కేటాయించకుండా వేములవాడ రాజన్నను, భక్తులను మోసం చేశారని దుయ్యబట్టారు. రాజన్న ఆలయ అభివృద్ధి విస్తరణ కోసం బడ్జెట్లో నిధులు కేటాయిస్తామని తాము హామీ ఇవ్వన ప్పటికీ బడ్జెట్‌లోనే 50 కోట్లు కేటాయిం చామన్నారు. భక్తుడిగా ఆలయ అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తున్నానని, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చొరవతో రాజన్న ఆలయ అభివృద్ధికి 75 కోట్లు కేటాయించామని, 47కోట్ల రూపాయలతో వేములవాడ పట్టణంలో రోడ్ల వెడల్పు కార్యక్రమాన్ని త్వరలో చేపట్టబోతున్నామని స్పష్టం చేశారు. గుడి చెరువులో, మూల వాగులో మురికి నీరు కలవకుండా ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని, వచ్చే మహాశివరాత్రి జాతర నాటికి రాజన్న ఆలయ విస్తరణకు కృషి చేస్తామని అన్నారు. గత ప్రభుత్వంలోగా రాజన్న ఆలయ అభివృద్ధిని విస్మరించబోమని, ఆలయ అభివృద్ధిపై ఎప్పటికప్పుడు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సైతం ఆరా తీస్తున్నారని ఆది శ్రీనివాస్ తెలిపారు.

పండుగ పూట విషాదం

కోనరావుపేట, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి) : కోనరావుపేట మండలం ధర్మారం గ్రామంలో మహాశివరాత్రి పర్వదిన సందర్భంగా విషాదఛాయలు అలుముకున్నాయి. గ్రామంలో మంగళవారం డిగ్రీ విద్యార్థి రాకేష్ ఆత్మహత్య చేసుకోగా, బుధవారం అదే గ్రామంలో వేములవాడ మురళి(75) అనే వృద్ధుడు హార్ట్ ఎటాక్‌తో మృతిచెందాడు. మృతిచెందిన మురళికి సంతానం లేకపోవడంతో భర్త మురళి చితికి భార్య మంగవ్వ నిప్పు పెటడం పలువురిని కన్నీరు పెట్టించింది.

టీటీడీ ఛైర్మన్‌కు అభినందనలు

ఇల్లంతకుంట, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): తిరుమల తిరుపతి దేవస్థానం ఛైర్మన్ బీఆర్ నాయుడిని పెద్దలింగాపూర్ గ్రామ మాజీ సర్పంచ్ గొడిశెల జితేందర్‌గౌడ్ కలిశారు. తిరుమలలో ఛైర్మన్‌ను బుధవారం కలిసి అభినందనలు తెలిపారు.

ఉన్నత లక్ష్యాలతో ముందుకు సాగాలి..

ఇల్లంతకుంట, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): క్రీడాకారులు ఉన్నత లక్ష్యాలతో ముందుకు సాగాలని యుజవన నాయకుడు కేతిరెడ్డి నవీన్‌రెడ్డి పేర్కొన్నారు. మండలంలోని పెద్దలింగాపూర్ గ్రామంలో బుధవారం క్రికెట్ క్రీడాకారులకు రూ 49 వేల విలువైన కిట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతు క్రీడాకారులకు సమాజంలో ఉన్నతస్థానం ఉందన్నారు. యువకులు సమయాన్ని వృథా చేయకుండా ఆటలపై దృష్టి నిలుపాలని సూచించారు. భవిష్యత్తులో క్రీడాకారులకు అండగా ఉంటానని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు గ్రామస్తులు, క్రీడాకారులు పాల్గొన్నారు.

మాజీ మంత్రి కేటీఆర్ చొరవతో రైతు రాజిరెడ్డికి బెయిల్

తంగళ్లపల్లి (సిరిసిల్ల రూరల్), ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ భూమిని కబ్జా చేశాడనే ఆరోపణలతో రెవెన్యూ అధికారుల ఫిర్యాదు మేరకు పోలీసులు అరెస్ట్ చేసి జైలుకు పంపించిన రైతు అబ్బాడి రాజిరెడ్డికి బుధవారం బెయిల్ రావడంతో ఇంటికి చేరున్నారు. తంగళ్లపల్లి మండలం జిల్లెల్ల గ్రామానికి చెందిన అబ్బాడి రాజిరెడ్డి గ్రామంలోని సర్వేనంబర్ 1183లో ఉన్న ప్రభుత్వ భూమిలో 30 గుంటల భూమిని కబ్జా చేసి పట్టా చేయించుకుని పంటలను సాగు చేసుకుంటున్నాడని ఐదు రోజుల క్రితం తంగళ్లపల్లి తహసీల్దార్ ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసిన పోలీసులు అరెస్ట్ చేసి జైలుకు పంపించారు. అయితే దీనిపై స్పందించిన సిరిసిల్ల ఎమ్మెల్యే, మాజీ మంత్రి కేటీఆర్ న్యాయవాదులతో మాట్లాడి బెయిల్‌ను ఇప్పించేలా ప్రయత్నాలు చేయడంతో శివరాత్రి పండుగ రోజున రాజిరెడ్డికి బెయిల్ వచ్చింది. కుటుంబ సభ్యులు, బీఆర్ఎస్ నాయకులు కరీంనగర్ జైలు నుంచి ఇంటికి తీసుకవచ్చారు.

కాగా, అనారోగ్యంతో ఉన్న తనను కరీంనగర్ జైలు అధికారులు బాగా చూసుకోవడంతో పాటు సమయం ప్రకారం మందులను అందించి వైద్యం చేయించా రని రైతు రాజిరెడ్డి తెలిపారు.


రాజిరెడ్డితో బీఆర్ఎస్ నాయకులు, కుటుంబ సభ్యులు